# మనిషిలో మనిషి

"డాక్టర్... ఎలా ఉంది మా రవికి?" —ఆందోళనతో అడిగాడు సేఠ్ భజరంగ్‌ప్రసాద్. కళ్ళంబట రాలబో తున్న అశ్రువులను బలవంతాన అణుచు కుంటున్నాడు ఆయన.

"చూడండి... యాక్సిడెంట్ చాలా పెద్దది. తలకి బలమైన గాయం కావ డంతో మెదడు బాగా దెబ్బతింది." అన్నాడు సర్జికల్ స్పెషలిస్ట్ డాక్టర్ జగన్నాథ్.

"అయితే మా రవికి ఏం ప్రమాదం లేదు కదా! వాడు మా ఒక్కగానొక్క కొడుకు డాక్టర్‌గారూ. వాడికేమైనా అయితే మేము భరించలేం. బతకలేం. ఎంత డబ్బైనా సరే వాడివి బాగు చేయండి డాక్టర్"— దీనంగా డాక్టర్ గారి చేతులు పట్టుకుని వేడుకున్నాడు భజరంగ్‌ప్రసాద్.

ఒక విషాదహాసం డాక్టర్‌గారి పెద వులమీద చోటుచేసుకుంది.

"చూడండి సేఠ్‌జీ. డబ్బుతో మనం ప్రాణాలు నిలబెట్టగలిగితే ఈ లోకంలో అసలు చావులే వుండవు. మీ అబ్బా యికి ప్రాణభయమైతే లేదు కాని..."

"కాని...చెప్పండి డాక్టర్...ప్లీజ్."

"మెదడులో దెబ్బతిన్న భాగాన్ని తొలగించవలసి ఉంటుంది. ఇది తప్పదు. ఇందువల్ల అతను చూపు కోల్పోయే ప్రమాదం ఉంది. మెదడుకి ఆపరేషన్ చేయకపోతే అసలు ప్రాణానికే ముప్పు."

"డాక్టర్...అలా అనకండి డాక్టర్- వాడి చీకటిబ్రతుకు నేను ఊహించుకో లేను. మీరు ఏమైనా చేయండి డాక్టర్- వాణ్ణి ఎలాగైనా కాపాడండి." అంటూ భోరుమన్నాడు భజరంగప్రసాద్.

"చెప్పాను కదా అబ్బాయికి ప్రాణ భయం లేదని. మీ అదృష్టం బాగుంటే అబ్బాయికి చూపు పోకపోవచ్చు. కాని ఒక అనుభవజ్ఞుడైన సర్జన్‌గా ఈ అవ కాశం ఇంచుమించు లేదనే చెప్పగలను. ఒక బాధ్యతగల డాక్టర్‌గా మీకు బాధ కలిగించే ఈ వాస్తవాన్ని చెప్పక తప్పదు."

"గుండెలు, మూత్రపిండాలు, కాలేయం వంటి భాగాలను మార్పిడి చేస్తున్న ఈ రోజుల్లో విజ్ఞానశాస్త్రం ఎంతగానో అభివృద్ధిచెందిన ఈ కాలంలో బ్రెయిన్ ట్రాన్స్‌ప్లాంట్‌చేసి మా వాడిని కాపాడలేరా డాక్టర్!"

"సూత్రరీత్యా మెదడు మార్పిడి సాధ్యమే అయినా ఆచరణలో ఇంకా

కె ఆర్. కె. మోహన్

అది సాధ్యంకాలేదు. ఒక వేళ అది సాధ్యమైనా మీకేం ప్రయోజనం లేదు."

"ఎందుచేత డాక్టర్?"

"అవును. మనిషికి వ్యక్తిత్వం ఇచ్చేది మెదడే. మెదడు తీసి మెదడు పెట్టామనుకోండి. శరీరం మాత్రం మీ అబ్బాయిది అవుతుంది. మనిషి మాత్రం ఎవరి మెదడు పెట్టామో అతనే అవుతాడు. అట్టి వ్యక్తి మిమ్మల్ని ఎవరినీ గుర్తించనుకూడా లేడు. అసలు మీ ఇంటికి సంబంధించిన జ్ఞాపకాలే ఉండవు. ఆ మెదడుకి సంబంధించిన వ్యక్తి జ్ఞాపకాలే ఉంటాయి. మీ వాడి కళ్ళతో తన వాళ్ళని గుర్తుపట్టాడు."

"అదెలా?"

"నిజమే. మనిషి దేహం మైక్ వంటిది. మైక్ వెనక తెలుగులో మాట్లాడితే తెలుగుమాటలు వినిపిస్తాయి. ఇంగ్లీషు మాట్లాడితే ఆ పలుకులు మైక్ లోంచి వినిపిస్తాయి. ఇలా ఏ భాషలో మాట్లాడితే, ఆయా భాషల మాటలు వినిపిస్తాయి. మగవారు మాట్లాడితే మగకంఠం, ఆడవారు పలికితే స్త్రీకంఠం ఇలా ఏ వ్యక్తి మాట్లాడితే ఆ మాటలు వినిపిస్తాయి. అదేవిధంగా ఏ వ్యక్తి మెదడు శరీరంలో వుంటే ఆ వ్యక్తి ఆదేశాలప్రకారమే ఆ దేహం నడచుకుంటుంది కాని, మీ అబ్బాయిలాగా కాదు. మెదడు మార్చడంవల్ల సజీవంగావున్న మీ అబ్బాయి రూపం మీ కళ్ళముందు ఉంటుంది కాని ఆ వ్యక్తి మాత్రం మీవాడు కానేరడు."

"మైగాడ్... డాక్టర్ గారూ...మీరు చెప్పిన మాటలు వింటుంటే నా మతి పోతోంది. ఎవరో వ్యక్తిని మావాడి రూపంలో చూసుకుంటూ, మా అబ్బాయిగా ఎలా భావించుకోగలను డాక్టర్! ఇంక మా అబ్బాయి గతి ఇంతేనా?" అంటూ వాపోయాడు భజరంగప్రసాద్.

"చూడండి. ఉన్న పరిస్థితి చెప్పాను. నిజానికి ఇప్పటికీ పూర్తిగా మెదడు మార్పిడి సాధ్యంకానేలేదు. ఒకవేళ సాధ్యమైతే పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పాను. అయితే మెదడులు నలభై శాతంవరకూ కూడా ట్రాన్స్‌ప్లాంట్ చేయవచ్చు. మీ అబ్బాయికి దృష్టి కనక పోతే అవసరమైన మేరకు బ్రెయిన్ ట్రాన్స్‌ప్లాంట్ చేసి దృష్టిని తెప్పించవచ్చు. అందుకు నేను గ్యారంటీ ఇయ్యగలను."

"అయితే ఇంక సమస్య ఏముంది డాక్టర్?" అకస్మాత్తుగా వచ్చిన ఆశ కళ్ళలో మెరుస్తుండగా అడిగాడు భజరంగప్రసాద్.

"అది అంత సులభం కాదు. ముందు మీ రవి మెదడుకి అపరేషన్ చేయాలి. మీ అదృష్టం బాగుంటే అతనికి చూపు పోకపోవచ్చు. కాని నేను ముందే చెప్తున్నట్లు ఇది ఇంచుమించు అసంభవం. అపరేషన్ గాయాలు మానడానికి కొన్ని

నెలలు పడ్తుంది. ఆ తర్వాత మీ అబ్బాయికి అనువైన మెదడు దొరకాలి. అప్పుడు మాత్రమే ట్రాన్స్‌ప్లాంట్ సాధ్యమవుతుంది."

"మెదడు దొరకడం అంత సమస్య ఏముంది. తెల్లవారి లేస్తే ఎంతమంది చనిపోవడంలేదు. అట్టివారి మెదడు ఏదైనా దొరకదా? ఎంత డబ్బు కావలసినా వెదజల్లుతాను."

"అక్కడే పొరబడుతున్నారు మిస్టర్ భజరంగ్. చనిపోయినవారి మెదడు పనికిరాదు. ట్రాన్స్‌ప్లాంట్‌కి అవసరమైన మెదడు తాజాగా ఉండాలి. అంటే యాక్సిడెంటులో అకస్మాత్తుగా చనిపోయినవారి మెదడు పనికివస్తుంది. అదేనా చనిపోయిన ఆరుగంటలలోపల తీసివేసి భద్రపరుస్తేనే. అట్టివ్యక్తి కూడా ఇంచుమించు మీవాడి వయసు కలిగి ఉండాలి. ఇవన్నీ సమకూడినప్పుడు విజయవంతంగా ట్రాన్స్‌ప్లాంట్ చేసి మీ అబ్బాయికి దృష్టి తెప్పించవచ్చు. ఇదంతా జరగాలంటే కనీసం నాలుగైదు నెలలు పడ్తుంది."

"అంటే అప్పటివరకూ మా రవి గుడ్డివాడుగా ఉండిపోవలసిందేనా?"

"తప్పదు."

"ఈలోగా ఎవరైనా ఆరోగ్యవంతుడైన కుర్రవాణ్ణి చంపించి అతని మెదడు తీసుకుంటేను" — అంతటి భయంకరమైన ఆలోచన వచ్చినందుకు తనమీద తనకే అసహ్యంవేసింది భజరంగ్‌కి.

"చూడండి. టైం అవుతోంది. మీ అబ్బాయి మెదడుకి ఇప్పుడు ఆపరేషన్ చేయాలి అందుకు మీరు అనుమతిస్తూ ఈ ఫారంమీద సంతకం పెట్టాలి." అంటూ ఒక ఫారం ముందుపెట్టాడు డాక్టర్ జగన్నాథ్.

మారు మాట్లాడకుండా దానిమీద సంతకంపెట్టాడు భజరంగ్.

డాక్టర్ జగన్నాథ్ ఆ ఫారం తీసుకుని వెంటనే పేషెంటుదగ్గరకి వెళ్ళిపోయాడు.

"మరికొంచెం సేపట్లో ఆపరేషన్ థియేటర్‌లోనికి స్ట్రెచ్చర్ వెళ్ళింది.


వెనకాలే ఒక వైద్యుల బృందం డాక్టర్ జగన్నాథ్ ముందు నడుస్తుండగా యూనిఫాంలలో లోనికి వెళ్ళింది.

ఆపరేషన్ థియేటర్ తలుపులు మూసుకున్నాయి.

డోర్‌పైనున్న రెడ్‌బల్బ్ వెలిగింది.

ఆరు గంటల కాలం అతి భారంగా గడిచింది.

అది ఆరు యుగాలుగా అనిపించింది బయటవున్న భజరంగ్‌ప్రసాదకీ అతని వారికీ.




ఆపరేషన్ థియేటర్ తలుపులు తెరుచుకున్నాయి.

స్ట్రెచ్చర్ మీద మెడవరకూ తెల్లని దుప్పటి కప్పిన రూపం బయటకు వచ్చింది అచేతనంగా వున్న రవి తలకి దట్టంగా కట్లు వున్నాయి.

స్ట్రెచ్చర్‌ని స్పెషల్ వార్డులోకి తీసుకువెళ్తుండగా ఆత్రంగా దానిని సమీపించారు భజరంగప్రసాద్, ఆయన వారూ.

ఓవరాల్ విప్పుకుంటూ దగ్గరకు వచ్చాడు డాక్టర్ జగన్నాధ్.

"సేఫ్టీ ... ఆపరేషన్ క్రైవేట్ సక్సెస్‌ఫుల్" అన్నాడు.

"అయితే మా అబ్బాయి చూపు..."

"దాని సంగతి అప్పుడే తెలీదు. అబ్బాయికి స్పృహవచ్చాక తెలుస్తుంది. స్పృహ రావడానికి ఇంకా ఆరుగంటలు పడ్తుంది."

"థాంక్యూ డాక్టర్ ... మీ రుణం జన్మలో తీర్చుకోలేను"

"డోన్ట్ బాదర్ ... గాడ్ ఈజ్ గ్రేట్."

రవిని స్పెషల్ వార్డులోకి తీసుకెళ్ళి బెడ్ మీద పరుండబెట్టారు. భజరంగ ప్రసాద్, ఆయన భార్య బెడ్ ప్రక్కనే కూర్చున్నారు. మిగిలినవారు బయట వరండాలో కూర్చుని మధ్యమధ్య లోనికి వచ్చి చూసిపోసాగారు.

రవికోసం ప్రత్యేకంగా వుంచిన నర్సు తరచుగా అక్కడికి వచ్చి పేషెంటుని చూసివెళ్తోంది.

సాయంత్రం ఆరుగంటలు కావస్తుండగా రవికి తెలివి రాసాగింది. నెమ్మదిగా అటూ ఇటూ కదలసాగాడు.

వెంటనే నర్సు వెళ్ళి డాక్టర్ జగన్నాథ్‌కి ఈ విషయం తెలిపింది.

నిజానికి అప్పటికి ఆయన డ్యూటీ అయిపోయినా, రవికోసం ఆయన ప్రత్యేకంగా ఉండిపోయాడు. కబురు అందగానే అక్కడికి ఆయన హుటాహుటిన వచ్చాడు. రాగానే ఏదో ఇంజక్షనిచ్చాడు. మరో పది నిమిషాలలో రవికి పూర్తి తెలివి వచ్చింది. మూలుగుతూ కళ్ళు తెరిచాడు.

"అమ్మా ... నే నెక్కడున్నాను?" అన్నాడు హీనస్వరంతో.

"బాబూ." అంటూ భుజాలు నిమరసాగింది తల్లి.

"నాయనా — రవీ ..." అంటూ ప్రక్కన కూర్చుని కొడుకు చేతిని ఆప్యాయంగా చేతిలోకి తీసుకున్నాడు భజరంగప్రసాద్.

"అమ్మా ... నాకేం కనిపించడం లేదు. నాన్నగారూ ... నాకేమైంది!" అన్నాడు రవి కళ్ళు పెద్దవిచేయ ప్రయత్నిస్తూ.

అతని తలిదండ్రులు దిగాలుగా డాక్టర్ జగన్నాథ్ ముఖంలోకి చూశారు.

ఒక్కసారి గొంతు సవరించుకున్నాడు డాక్టర్ జగన్నాథ్.


"చూడు మిస్టర్ రవీ. నేను డాక్టర్ జగన్నాథ్ మాట్లాడుతున్నాను. నీకు యాక్సిడెంటు అయింది కదా. ఆపరేట్ చేయవలసి వచ్చింది. ఇప్పుడేమీ ఫర్వాలేదులే. నీ గాయాలు తగ్గేవరకూ నీకు ఏమీ కనిపించదు. ఆ తర్వాత అంతా సరిగానే వుంటుంది. డోన్ట్ వర్రీ. జస్ట్ బేర్" అన్నాడు.

"అమ్మా ... నేను గ్రుడ్డివాడినై పోయానా! నాన్నగారూ నేనేం చేయాలి!" అన్నాడు రవి గద్గద స్వరంతో.

"ఇది నీ గాయాలు మానేవరకేనని చెప్పాను కదా. యూ ఆర్ ఎ బ్రేవ్ బాయ్. వై డూ యూ ఫియర్?" అంటూ రవి భుజం తట్టాడు డాక్టర్ జగన్నాథ్.

రవి ఏమీ మాట్లాడకుండా తల ప్రక్కకు తిప్పుకున్నాడు.

"ఓకే బాయ్. నేను మళ్ళీ వస్తాను. హేవ్ గుడ్ రెస్టు" అంటూ బయటకు వస్తూ భుజంగప్రసాదును బయటకు రమ్మని సైగ చేశాడు డాక్టర్ జగన్నాథ్. ఆయన వరండాలోకి రాగానే "చూడండి! రవి గ్రుడ్డివాడైనట్లు అతనికి ఎంత మాత్రం తెలియకూడదు. ఈ గ్రుడ్డితనం తాత్కాలికమేనన్న నమ్మకం అతనికి ఉండాలి. లేదా ప్రమాదం. భగవంతుడి దయవల్ల అతనికి పూర్తిగా తగ్గే సమయానికి తగిన బ్రెయిన్ దొరికి ట్రాన్స్‌ప్లాంటేషన్ కూడా పాజిబుల్ కావచ్చు. మీరు మాత్రం ధైర్యంగా ఉంటూ, మీ అబ్బాయి ధైర్యం కోల్పో




కుండా వుండేటట్లు చూసుకోవాలి..." అని హెచ్చరించాడు.

"అలాగేసార్!" అంటూ నమస్కరించాడు భజరంగప్రసాద్.

*　*　*

నాలుగు నెలలు గడిచిపోయాయి.

గ్రుడ్డి జీవితానికి అలవాటు పడుతున్నాడు రవి. ఈ చీకట్లోంచి వెలుగు రాకపోతుందా అన్న ఆశ లోలోపల వెలుగుతోంది.

డాక్టర్ జగన్నాథ్ నగరంలో వున్న ఆస్పత్రుల అధికారులందరికీ ప్రమాదంలో మరణించిన యవ్వనవంతుల దేహాలు దొరికితే వారి మెదళ్ళు సేకరించి భద్రపరిచే ప్రయత్నాలు చేయవలసిందిగా అభ్యర్థనలు పంపాడు. పోస్టుమార్టంకి వచ్చే దేహాల మెదళ్ళను అమ్మితే ఎంతైనా వెచ్చించి కొనడానికి భజరంగప్రసాద్ సిద్ధంగా ఉన్నాడు.

రవి గాయాలు పూర్తిగా మానాయి. అతనికి ఏ రోజైనా మెదడు ట్రాన్స్‌ప్లాంట్ చేయవచ్చు. అనువైన మెదడు దొరకడమే ఆలశ్యం.

ఆ రోజు డాక్టర్ జగన్నాథ్ దగ్గర్నుంచి భజరంగప్రసాద్‌కి ఫోన్ వచ్చింది.

"చూడండి సేఠ్‌జీ...ఈ రోజు ప్రొద్దున్న హత్య గావించబడ్డ ఒక వ్యక్తి శవం మా హాస్పిటల్‌కి వచ్చింది. పోస్టుమార్టం నా సమక్షంలో జరిగింది. ఆరోగ్యవంతమైన ఆ మెదడు మీ అబ్బాయికి ట్రాన్స్‌ప్లాంట్ చేయడానికి పనికివస్తుంది. ఆ మెదడును మీకు అమ్మడానికి వాళ్ళని ఒప్పించాను. మీరు సరేనంటే ఆ మెదడును తీసి భద్రపరచి, ట్రాన్స్‌ప్లాంటేషన్‌కి ఏర్పాట్లు చేస్తాను." అన్నారు ఆయన.

"డాక్టర్ గారూ...నన్నడగాల్సిన అవసరం ఏముంది? మీరు ఎలా చెపితే అలాగే. నేను వెంటనే అక్కడికి వస్తాను" అన్నాడు భజరంగ్ పట్టరాని సంతోషంతో.

"సరే...మీరు రవిని తీసుకుని హాస్పిటల్‌కి వచ్చేయండి. వెంటనే ఇన్‌పేషెంట్‌గా అడ్మిట్ చేసుకుంటాను. ఈ లోగా మెదడుని తీసి భద్రపరుస్తాను." అన్నాడు డాక్టర్ జగన్నాధ్.

రవి మెదడులో దెబ్బతిన్న భాగాన్ని తీసేసి కొత్త మెదడులోని సుమారు ఇరవై ఐదు శాతం భాగంతో ట్రాన్స్‌ప్లాంట్ చేశాడు డాక్టర్ జగన్నాధ్. ఆపరేషన్ అత్యంత విజయవంతంగా జరిగింది.

ఆపరేషన్ పూర్తి అయ్యాక "యూ అర్ వెరీ లక్కీ సేఠ్‌జీ. మీవాడి కోసమేనా అన్నంత మంచి మెదడు దొరికింది. చాలా సక్సెస్‌ఫుల్‌గా ట్రాన్స్‌ప్లాంటేషన్ జరిగింది. ఈ కొత్త మెదడుని బాడీ రిసీవ్ చేసుకోవడంలో ఎటువంటి ప్రాబ్లెమ్స్ ఉండవనే నా నమ్మకం. మీ రవికి డెఫినెట్‌గా చూపు వస్తుంది. దేరీజ్ నో డౌట్ ఎబౌట్ ఇట్" అన్నాడు డాక్టర్ జగన్నాధ్ సంతోషంతో.

"డాక్టర్‌గారూ...మీ రుణం తీర్చుకోలేను" అంటూ ఆయన కాళ్ళ మీద పడ్డాడు.

"నో...నో... డోన్ట్‌బి సిల్లీ..." అంటూ ఆయన్ని లేవనెత్తారు డాక్టర్.

*　　　*　　　*

ఆ రోజు రవికి కట్లు విప్పుతారు. దృష్టిని పరీక్షిస్తారు.

డాక్టర్ జగన్నాధ్ రవి గదిలోకి ప్రవేశించాడు. నర్సు వెంట ఉంది.

గదిలో లైట్లను బాగా డిమ్ చేశాడు.

"చూడు మిస్టర్ రవీ...నీ తలకి కట్లు విప్పుతాం. నేను చెప్పినప్పుడు నెమ్మది నెమ్మదిగా కళ్ళు తెరు" అని కట్లు విప్పసాగాడు డాక్టర్.

కొంచెం సేపు గడిచింది.

"యస్ రవీ! నెమ్మదిగా కళ్ళు తెరు"

రవి మొగ్గలు విచ్చుకుంటున్నట్లు నెమ్మదిగా కళ్ళు తెరిచాడు

"చెప్పు నీకు కనిపిస్తోందా?"

"కనిపిస్తోంది డాక్టర్‌గారూ—మసకమసకగా ఉంది. గుడ్డిదీపం వెలుగులో చూస్తున్నట్లనిపిస్తోంది."

"వెరీగుడ్!" అంటూ నెమ్మదిగా గదిలో కాంతిని పెంచసాగాడు.

"డాక్టర్‌గారూ! నాకు బాగా కనిపిస్తోంది. నేను మామూలుగా చూడగలుగుతున్నాను" అన్నాడు రవి ఆనందంగా.

"వెరీగుడ్ బాయ్...ఐయామ్ రియల్లీ వెరీ హాపీ" అంటూ రవి భుజం తట్టాడు డాక్టర్ జగన్నాధ్.

భజరంగ్ ప్రసాద్, ఆయన వాళ్ళ ఆనందానికి అవధులు లేవు.

"ఓ.కే. నేను మళ్ళీ వస్తాను. హేవ్ గుడ్ రెస్ట్. కళ్ళు మూసుకుని విశ్రాంతి తీసుకో. ఈ రోజు ఎక్కువగా చూడ వద్దు" అంటూ బయటకి వచ్చాడు డాక్టర్.

"డాక్టర్‌గారూ...అబ్బాయి ఇంకా ఎన్నాళ్ళు ఇక్కడ ఉండాలి?" అని అడిగాడు సేఠ్ భజరంగ్ ప్రసాద్.

"జస్ట్ త్రీ డేస్. మూడు రోజులు అవగానే డిశ్చార్జి చేస్తాం. ఇదే నా అబ్జర్వేషన్ కోసమే. ఈ రోజు రాత్రి నాకు డ్యూటి కూడా ఉంది. ఈ రాత్రి మధ్య మధ్య వచ్చి రవివి చూస్తుంటాను కూడా. నా రెస్ట్‌రూం కూడా మీ వార్డుకి దగ్గర్లోనే ఉంది. మీరు దేనికీ భయపడ నక్కర్లేదు. యువర్ బాయ్ ఈజ్ క్వైట్ ఆల్‌రైట్."

"థాంక్యూ డాక్టర్‌గారూ! మీకు నా కృతజ్ఞతలు ఎలా తెలియజెప్పాలో అర్థం కావడంలేదు మా అబ్బాయికి మీరు పునర్జన్మ ఇచ్చారు. మీకు మేమంతా జన్మంతా ఋణపడి ఉంటాం" అన్నాడు భజరంగ్ ప్రసాద్ చేతులెత్తి నమస్కారం పెడ్తూ.

"దట్సాల్‌రైట్!" అంటూ బయటకి వెళ్ళాడు డాక్టర్ జగన్నాథ్.

*   *   *

రాత్రి రెండు గంటలు అవుతోంది. అంతా నిశ్శబ్దం ఆలుముకుని ఉంది. కీచురాళ్ళ అరపులు భయం కల్పిస్తు న్నాయి.

నైట్ డ్యూటీలో ఓ రౌండ్‌కొట్టి డార్మిటరీకి వచ్చి అప్పుడే కుర్చీలో కూర్చున్నాడు డాక్టర్ జగన్నాథ్.

సేఠ్ భజరంగప్రసాద్ కంగారుగా రొప్పుతూ అక్కడికి వచ్చాడు

ఆయన కంగారుచూసి ఆత్రంగా లేచి నుంచున్నాడు డాక్టర్.

"డాక్టర్‌గారూ! రవి నిద్రలోంచి ఉలిక్కిపడిలేచి భయంగా వెర్రికేకలు పెడుతున్నాడు. భుజంతట్టి లేపినా కేకలు ఆపడంలేదు" అన్నాడు భజరంగ్.

"పదండి" అంటూ చేతిలో స్టెత స్కోప్‌తో వడివడిగా ముందుకుసాగాడు డాక్టర్ జగన్నాథ్. వెనకాలే వెళ్ళాడు భజరంగ్.

నిద్రలో ఇంకా అరుస్తూ కాళ్ళూ, చేతులూ కొట్టుకుంటూనే ఉన్నాడు రవి.

చెంపలమీద గట్టిగా తట్టి లేపాడు డాక్టర్ జగన్నాథ్.

మెలుకువ వచ్చి భయంగా ఆయన వంక చూడసాగాడు రవి.

"ఏమైంది రవీ...ఏమైంది! ఏమైనా పీడకల వచ్చిందా?"

రవి మౌనంగా తల అటూ ఇటూ తిప్పి చూశాడు తల్లీ, తండ్రీ కని పించారు

"చాలా భయంకరమైన కలవచ్చింది డాక్టర్‌గారూ. ఎవరో త్రాగుబోతు నా

కళ్ళముందే ఓ చిన్నపిల్ల పీక పిసికి చంపివేశాడు. నేను అడ్డు వెళ్ళబోతే గొడ్డలితో నన్ను నరకడానికి వచ్చాడు" అన్నాడు రవి.

"ఓ. ఇటీజ్ ఎ నైట్‌మేర్. కొంచెం మంచినీళ్ళు త్రాగి కళ్ళు మూసుకుని పడుకో."

"ఇది కలలాగా అనిపించడంలేదు డాక్టర్‌గారూ! నిజంగా నన్నెవరో చంపడానికి వస్తున్నట్లనిపిస్తోంది" అన్నాడు రవి భయంగా.

"కొన్ని కలలు అంత భయంకరంగానే ఉంటాయి. మరేం ఫర్వాలేదు. మేమంతా ఇక్కడే ఉన్నాంగా."

రవి అన్‌ఈజీగా పడుకున్నాడు. కలతనిద్రేకాని కమ్మనినిద్ర రానేలేదు. ఆ కలత నిద్రలో కూడా ఆ పీడకలే పదే పదే వెంటాడసాగింది. ఆ విషయం మర్నాడు ప్రొద్దున తండ్రికీ, డాక్టర్ జగన్నాధ్‌కి కూడా చెప్పాడు.

"కలలకేముంది డోన్ట్ బాదర్" అన్నాడు ఆయన.

అంతా నార్మల్‌గా ఉండడంతో ఆ రోజు రవిని డిశ్చార్జ్ చేశారు.

రవిని బీచ్‌కి ఇతర ప్రదేశాలకీ, సినిమాలకీ తరచుగా తీసుకు వెళ్తుండమని సలహా ఇచ్చాడు డాక్టర్ జగన్నాధ్. అందువల్ల అతని దృష్టి అనవసర విషయాలమీద నుంచి మారుతుందనీ. రకరకాల దృశ్యాలకు కళ్ళు అలవాటు పడుతాయని చెప్పాడు ఆయన

ఆయన దగ్గర సెలవు తీసుకుని రవిని ఇంటికి తీసుకుపోయాడు భజరంగ్.

* * *

ఆ రోజు రవి మిత్రులతో కలిసి సినిమాకి వెళ్ళాడు.

సినిమాలో ఒక త్రాగుబోతు తండ్రి త్రాగిన మైకంలో పిల్లలని చావబాదుతుంటాడు. అడ్డుపడబోయిన తల్లిని గొడ్డలితో నరకబోతాడు. ఆ దృశ్యం చూడగానే రవి కంగారుగా, భయంగా పెద్దకేకవేసి హాలు బయటకు పరిగెత్తుకు వచ్చాడు. ఆ దృశ్యం, అతనికి వచ్చిన కల ఒకే విధంగా ఉన్నాయి! అతని వెనకనే మిత్రులు కూడా బయటకువచ్చి అతన్ని ఇంటికి తీసుకువచ్చారు.

ఇంటికి వచ్చాక కూడా రవికి భయం తగ్గలేదు. వళ్ళంతా చెమటలు పట్టేసింది. ఊరికే బెదురుచూపులు చూడసాగాడు. భజరంగ్ ప్రసాద్ వెంటనే డాక్టర్ జగన్నాధ్‌కి ఫోన్ చేశాడు. మరో అరగంటలో ఆయన వచ్చారు.

సంగతి అంతా విన్నాక ఆయన "రవీ! ఈ సినిమా నువ్వు ఇంతకు ముందు చూశావా?" అని అడిగాడు.

"లేదు" అన్నాడు రవి.

"ఇది రిలీజై వారం రోజు లే అయింది!" అన్నాడు రవి స్నేహితుడు ఒకడు.

"విచిత్రంగా ఉందే!" అని అస్పష్టంగా అనుకుని "కొన్ని కొన్ని




కలలు వాస్తవ సంఘటనలంత బలంగా మనసుమీద ముద్రవేస్తాయి. ఆ కలని నువ్వు మర్చిపోకపోవడం, సినిమాలో అటువంటి దృశ్యమే కాకతాళీయంగా కనిపించడంవల్ల నువ్వు ఇంతగా బెంబేలు పడిపోయావు. టేక్ ఇట్ ఈజీ!" అని కాంపోజ్ ఇంజక్షన్ ఇచ్చి సెలవు తీసుకున్నాడు డాక్టర్ జగన్నాథ్.

"బంగారంలా వున్న పిల్లవాడు స్నేహితులతో కలిసి పిక్నిక్‌కి వెళ్ళడమేమిటి? ఘాట్ రోడ్డుమీద అతని మోటార్ సైకిల్ గోడకు ఢీకొట్టి యాక్సిడెంట్ అవడమేమిటి? దృష్టి పోవడమేమిటి? తిరిగి వచ్చిందని సంతోషిస్తుంటే మళ్ళీ ఈ ఉత్పాతం ఏమిటి? భగవంతుడా మమ్మల్ని రక్షించు" అంటూ తనలో తనే కుమిలిపోసాగాడు సేఠ్ భజరంగ ప్రసాద్.

కొంచెం సేపటికి రవి ప్రశాంతంగా నిద్రపోయాడు.

వెంట వచ్చిన స్నేహితులు సెలవు తీసుకుని వెళ్ళిపోయారు.

*　　　*　　　*

నాలుగు రోజులు గడిచింది. ఆ కల రవిని భయంకరంగా కాకపోయినా నీలి నీడవలె వెంటాడుతోంది.

ఆ రోజు రవి స్నేహితులతో కలిసి బీచ్‌కి షికారుకి వెళ్ళాడు. ఆ దగ్గర్లోనే బెస్తవారి పల్లె ఉంది. ఆ రోజు అక్కడ ఏదో జాతర ఉంది. దూరాన్నుంచే నానా కోలాహలంగా ఉంది. సరదాకొద్దీ అదేదో చూద్దామని మిత్రులందరూ బయలుదేరారు.

జాతర వేడుకలు కొంచెం సేపు చూసి తిరుగుముఖం పట్టారు.

ఆ పల్లెలోంచి వస్తుంటే ఉన్నట్లుండి ఒక గుడిశముందు ఆగిపోయాడు ఉన్నట్లుండి అతని ముఖం కోపంతో ఎర్రబడిపోయింది. కళ్లు నిప్పులు చెరగసాగాయి.

ఆ గుడిసె ముందు ఒక ఆరేళ్ళ పిల్లాడు మట్టిలో ఆడుకుంటున్నాడు.

చింపిరిజుట్టు, మాసిన బట్టలు ముక్కు చీమిడి-చూడ్డానికి అసహ్యంగాఉన్నాడు. వాడిని చూడగానే రవి ఆప్యాయంగా "బుజ్జీ!" అంటూ దగ్గరికి తీసుకున్నాడు.

ఆ పిల్లవాడు బెదిరిపోయి రవివంకే చూస్తూండిపోయాడు.

"బుజ్జీ...చిట్టి అక్క ఏదీ...ఆ... అవును. నాన్న దానిని చంపేశాడుగా?" అని అంటుండగానే గొంతు పెరిగిపోయింది. పట్టరాని కోపంతో-"ఏడీ ఆ తాగుబోతు సచ్చివోడు" అంటూ ఒక్క అరుపు అరిచాడు

"నాన్నని పోలీసోళ్లు పట్టుకుపోయారుగా" అన్నాడు ఆ పిల్లవాడు భయంతో.

ఈ సందడికి చుట్టుపక్కలవాళ్ళు పోగయ్యారు.

వాళ్లలో ఒకామెనుచూస్తూ "సిన్నమ్మా ఈన నన్ను బుజ్జీ అంటున్నాడు. నాన్న ఏడీ అని అడిగాడు" అంటూ ఆమెను వాటేసుకున్నాడు.

"ఎవరు బాబూ నువ్వు?" అంటూ దగ్గరకు వచ్చింది ఆమె.

"నేను...నేను" అంటూ రవి ఏదో చెప్పబోతుండగా అతని స్నేహితులు బలవంతాన అతనినోరుమూసి అవతలికి ఈడ్చుకుపోయారు.

"ఏంది పట్నంబాబులూ?" అంటూ ఎవరో అడిగారు.

"మా వాడికి మతి చలించింది. ఏమీ అనుకోకండి." అంటూ ఒక స్నేహితుడు సమాధానం చెప్పి ముందుకి సాగిపోయాడు.

ఈ ఆకస్మిక సంఘటనకి విస్తుపోయి పట్నంబాబులవంకే చూస్తుండిపోయారు పల్లెవారు.

దారిలో రవిని పట్టుకోవడం చాలా కష్టం అయిపోయింది. మిత్రుల్ని గుర్తు పట్టనట్లే ప్రవర్తించసాగాడు. ఏదో లోకంలో వున్నట్లు చూస్తూ. "ఏడే ఆ దొంగనాయాల. నా చిట్టిని చంపేశాడు. నన్ను చంపాలని చూశాడు. వాణ్ణి బతకనివ్వను. పీక పిసికి చంపేస్తాను" అంటూ మాటి మాటికీ అరవసాగాడు. పళ్ళు కొరుకుతూ, పిడికిలి బిగించసాగాడు.

రవికి ఏమైందో స్నేహితులకి అర్థం కాలేదు. అమితమైన ఆందోళనతో అతి కష్టంమీద అతన్ని ఇంటికి జేర్చారు.

ఆవేశంతో అలిసిపోయి ప్రక్కమీద ఒరిగిపోయాడు రవి.

వెంటనే డాక్టర్ జగన్నాథ్‌కి ఫోన్ చేశారు.

ఆయన హుటాహుటిన అక్కడికి వచ్చాడు.

అప్పటికి ఇంకా రవి విద్రబోతూనే వున్నాడు.

డాక్టర్‌గారిని ప్రక్కగదిలోకి తీసుకు వెళ్ళి జరిగిందంతా వివరంగా చెప్పారు మిత్రులు.

"డాక్టర్‌గారూ...ఏమిటిది? మా వాడికి ఏదైనా దయ్యంకాని, భూతంకాని

పట్టలేదు కదా! లేకుంటే ఈ కలలేమిటి? ఈ చేష్టలేమిటి?" అంటూ వాపోయాడు సేఠ్ భజరంగప్రసాద్.

"ఊ!" అని భారంగా నిట్టూర్చాడు డాక్టర్ జగన్నాథ్.

"మనం ఇవేవో కలలని ఇన్నాళ్ళూ అనుకున్నాం కాని. ఇతని కేసులో కలలను మించినదేదో ఉంది. ఈ కేసు సైకియాట్రిస్ట్‌కి రిఫర్ చేయాల్సిందే. ఈ విషయంలో డాక్టర్ వాసు సూపర్ స్పెషలిస్ట్. రవిని రేపు ఆయన దగ్గరకు తీసుకు వెళ్తాను" అన్నాడు ఆయన.

"ఈలోగా మళ్ళీ అది తిరగబెడ్తే?" ఆందోళనగా అడిగాడు భజరంగ్.

"అదేదో మోమెంటరీ ఫిట్. మళ్ళీ వస్తుందని అనుకోను. ఇప్పుడు ఇంజక్షన్ ఇచ్చి వెళ్తాను. ప్రశాంతంగా పడుకుంటాడు" అంటూ ఇంజక్షన్ ఇయ్యడానికి లోనికి వెళ్లాడు డాక్టర్ జగన్నాథ్.

* * *

మర్నాడు ప్రొద్దున్నే డాక్టర్ వాసు దగ్గరికి రవిని తీసుకుని వెళ్ళాడు డాక్టర్ జగన్నాథ్. డాక్టర్ వాసుతో ప్రైవేట్‌గా కేసు వివరాలన్నీ చెప్పాడు.

"రవిని నేను ఇన్ - పేషెంట్‌గా ఎడ్మిట్ చేసుకుంటాను. సైకియాట్రిక్ టెస్ట్స్ అన్నీ చేస్తాను. ఈలోగా మీరు నాకు సహాయం చేయాలి" అన్నాడు డాక్టర్ వాసు.

"చెప్పండి. అంతకంటేనా?"

"నిన్న రవి ఏదో ఇంటి ముందుకి వెళ్ళగానే అక్కడి పిల్లవాడిని "బజ్జీ!" అని పలకరించాడనీ, ఆవేశంతో ఎవర్నో చంపుతానని అరిచాడనీ చెప్పారు కదా. ఆ ఇంట్లో వున్నవారిని గురించి వివరాలు తెలుసుకోండి. ఇటీవల ఆ ఇంట్లో ముఖ్యమైన సంఘటనలు ఏమైనా జరిగాయేమో వాకబు చేయండి."

"అవును. ఆ ఇంటికీ ఈ కేసుకీ ఏదో సంబంధం ఉందనే నా నమ్మకం! రవి నాన్నగారు ఇది పునర్జన్మ కేసు కాదుగదా అని అనుమానిస్తున్నారు. ఆ ఇంట్లో వారిని గుర్తుపట్టడం. ఇవన్నీ ఆ అనుమానాన్ని కల్పిస్తున్నాయి."

"పునర్జన్మ సిద్ధాంతానికి శాస్త్రీయమైన వివరణ ఏదీ లేదు. పునర్జన్మలుగా భావించిన ఎన్నో కేసుల రహస్యం కూడా సైకియాట్రీ ద్వారా ఛేదించడం జరిగింది."

"అవును నిజమే. పునర్జన్మని నేను నమ్ముతానని కాదు. సందర్భం వచ్చింది కాబట్టి చెప్పాను అంతే!" అన్నాడు డాక్టర్ జగన్నాథ్.

"ఓకే. మీరు సాధ్యమైనంత త్వరగా నేనడిగిన సమాచారం తెలుపండి."

"ష్యూర్!" అంటూ శెలవు తీసుకొన్నాడు డాక్టర్ జగన్నాథ్.

* * *

మర్నాడు ప్రొద్దున డాక్టర్ వాసు దగ్గరకి వచ్చాడు డాక్టర్ జగన్నాథ్.

"డాక్టర్! మీరు అడిగిన సమాచారం సేకరించాను. ఆ ఇంట్లో రంగడు అనే త్రాగుబోతు ఉండేవాడు. ఓ రోజు బాగా త్రాగివచ్చి, తాను చెప్పినపని చేయలేదన్న వెర్రికోపంతో పదేళ్ళ కూతుర్ని గొంతుపిసికి చంపేశాడు. దాంతో రంగడి

భార్య నర్సమ్మ వెర్రికోపంతో వాడి పీక పిసికి చంపాలని వెళ్ళిందట. ఈలోగా రంగడు గొడ్డలి తీసుకుని ఆమె మెడ నరికి చంపేశాడు. ఆ నర్సమ్మ మెదడులో భాగాన్నే రవికి ట్రాన్స్ప్లాంట్ చేయడం జరిగింది. ఇప్పుడు నాకు అర్థమయింది అతనికి ఒకేరకమైన కలలూ, జ్ఞాపకాలూ ఎందుకు వస్తున్నాయో? అతనికి ట్రాన్స్ప్లాంట్ చేసిన మెదడు భాగంలో ఆమె జ్ఞాపకాలు దాగిన భాగాలు కూడా ఉన్నాయన్నమాట. అందుకే అవకాశం వచ్చినప్పుడల్లా ఆ కసి ఆవేశంగా వెలువడుతోంది." అని చెప్పాడు డాక్టర్ జగన్నాథ్.

"నిన్న నేను రవిని హిప్నటిక్ స్లీప్‌లోకి పంపి అతని మనసులోని ఆలోచనలు బయటపెట్టించాను. మీరు చెప్పినదే అతనూ చెప్పాడు. భర్త పీక పిసికి చంపాలనే ఆవేశం చల్లారకుండానే ఆమె తల తెగిపోవడంతో, బలీయమైన ఆ భావాలు అలాగే ఉండిపోయాయి. ఏదో విధంగా ఆ ఆవేశం చల్లారేవరకూ ఈ కలలు వెంటాడుతునే ఉంటాయి."

వారు అలా మాట్లాడుకుంటుండగా రవి అటు వచ్చాడు.

"హలో రవీ! హౌ ఆర్ యూ?" అని అడిగాడు డాక్టర్ జగన్నాథ్.

"ఫర్వాలేదండీ-కానీ నాకు ఏమిటో ఎవర్నో పీక పిసికి చంపివేయాలని పిస్తోంది. పట్టరాని ఆవేశం వస్తోంది. నాకు తెలియకుండానే ఎవరి గొంతునైనా పిసికి చంపివేస్తానేమోనని భయం వేస్తోంది" అన్నాడు రవి.

డాక్టర్లు ఇద్దరూ ఒకరి ముఖం ఇంకొకరు చూసుకున్నారు.

"హాయిగా రెస్ట్ తీసుకో రవీ! అనవసరపు ఆలోచనలు మానేయి. డాక్టర్ వాసుగారు ట్రీట్‌మెంట్ మొదలుపెట్టారుగా. త్వరలోనే తగ్గిపోతుంది" అని ధైర్యం చెప్పాడు డాక్టర్ జగన్నాథ్.

రవి తన రూంలోకి వెళ్ళిపోయాడు.

"ఇతని కేసు కాంప్లికేట్ అయ్యేట్లుంది. ఆలస్యం చేస్తే ఎవర్నైనా చంపగలడు!" అన్నాడు డాక్టర్ జగన్నాథ్.

"అవును. వెంటనే ఇతని బ్రెయిన్‌కి ఆపరేట్ చేసి ఆ జ్ఞాపకాలు నిక్షిప్తమైన భాగాన్ని తొలగించాలి. లేదా ఆ రంగడిని తెప్పించి అతని పీక పిసికించేటట్లు చేసి ప్రాణంమాత్రం పోకుండా అతన్ని రక్షించాలి" అన్నాడు డాక్టర్ వాసు.

"పీక పిసికించి రిస్క్ తీసుకోవడం కంటే ఆపరేట్ చేయడమే మంచిది. దానిని నేను సులువుగానే చేయగలను." అన్నాడు డాక్టర్ జగన్నాథ్.

"వెరీగుడ్. దెన్ యు ప్రొసీడ్ ఎట్ ది ఎర్లీఎస్ట్" అన్నాడు డాక్టర్ వాసు.

* * *

ఆపరేషన్ రూంలో డాక్టర్ జగన్నాథ్ నాయకత్వంలో రవి మెదడుకి ఆపరేషన్ చేయడానికి అంతా సిద్ధ

మయింది. మత్తుమందువల్ల స్పృహా లేకుండా అచేతనంగా టేబిల్ మీద పడు కుని ఉన్నాడు రవి.

బయట వెయిటింగ్ రూంలో డాక్టర్ వాసు డైలీ చూస్తున్నాడు

సేఠ్ భజరంగప్రసాద్, అతనివారూ మరో ప్రక్క ఆందోళనగా కూర్చున్నారు.

ఆ నాటి డైలీలో ఒక వింత కేసు డాక్టర్ వాసు దృష్టిని ఆకర్షించింది. అది చదువగానే ఆయన ముఖం వివర్ణమై పోయింది.

ఇంతలో ఆపరేషన్ థియేటర్‌లో ఏదో కలకలం వినిపించింది. ఎమర్జెన్సీ లైట్లు వెలిగాయి. అలారం గణగణా మ్రోగింది.

థియేటర్ తలుపులు దఢాలున తెరుచు కున్నాయి.

కంగారుగా ఆ గదిలోకి దూసుకు వెళ్ళాడు డాక్టర్ వాసు.

లోపల దృశ్యం చూసి నిశ్చేష్టుడై పోయాడు.

ఆపరేషన్ టేబిల్ మీదున్న రవి లేచి కూర్చుని ఆవేశంతో బుసలు కొడు తున్నాడు. ఉడుంపట్టులాంటి అతని చేతుల పట్టులో డాక్టర్ జగన్నాథ్ మెడ ఇరుక్కుని ఉంది. దానిని విడిపించుకో డానికి ఆయన విలవిలా కొట్టుకుంటు న్నాడు. మిగిలినవారు రవి చేతులు ఎంతగట్టిగా లాగినా అవి ఊడి రావడం లేదు.

కొద్ది నిముషాలలోనే డాక్టర్ జగ న్నాథ్ మెడ వాల్చేశాడు. ఆయన ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసి పోయాయి. ఆవేశం తగ్గగానే రవి అలసి పోయి అచేతనంగా పడిపోయాడు

డాక్టర్ జగన్నాథ్ ప్రాణాలు కాపాడా లని డాక్టర్లు ఎంతో ప్రయత్నించారు కాని ఫలితం లేకపోయింది.

బొంబాయిలోని ఒక పెద్ద హాస్పి టల్‌లో గత మార్చిలో సరిగ్గా ఇట్టి సంఘటనే జరిగింది. ఆపరేషన్ బల్ల మీదున్న బ్రెయిన్ ఆపరేషన్ చేయవల సిన పేషెంట్ అకస్మాత్తుగా లేచి సర్జన్ పీక నులిమి చంపేశాడు. అలా ఎందుకు జరిగిందో అంతుపట్టలేదని ఆ వార్తను గురించి ఆనాటి పత్రికలో ఉంది. అందుకే అది చదివి అంతగా నిర్విణ్ణుడయ్యాడు డాక్టర్ వాసు.

ఇంతలోనే ఇంత ఘోరం ఇక్కడా జరిగింది.

"బ్రెయిన్ ట్రాన్స్‌ప్లాంట్‌ను విజయవంతంగా చేయగలుగుతున్నాం కాని సురక్షితంగా ఇంకా చేయలేక పోతున్నాం!" అనుకుంటూ వివర్ణ వద నంతో బయటకు వచ్చాడు డాక్టర్ వాసు.

బయటకు ఉబికి వచ్చిన డాక్టర్ జగన్నాథ్ గ్రుడ్లు తమ చూపుల ద్వారా ఈ మాటల్నే అంటున్నట్లు అనిపించింది ఆయనకి.